క్లుప్తంగా

కాకినాడ రూరల్ ఎంపీడీఓగా రమేష్ నాయుడు



కాకినాడ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.రమేష్‌నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన కర్రే స్వప్న విశాఖ జిల్లా పాయకరావుపేట బదిలీపై వెళ్లారు. ఈమె స్థానంలో ఎంపీడీఓగా విశాఖ జిల్లా సబ్బవరం నుంచి రమేష్‌నాయుడు బదిలీపై వచ్చారు. కొత్తగా విధుల్లో చేరిన రమేష్‌నాయుడుకు ఏఓ చంద్రశేఖర్ తదితరులు స్వాగతం పలికారు.

ఈఓపీఆర్‌డీ బదిలీ

కాకినాడ రూరల్ మండల ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు బదిలీ అయ్యారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం బదిలీ కావడంతో ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం కార్యదర్శిగా త్రినాథరావు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా రమణయ్యపేట రాయుడు పాలేనికి చెందిన మీసాల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

కాకినాడ రూరల్: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన పనులపై శుక్రవారం కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఏపీఓ కొండలరావు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ప్రజా వేదికలో గ్రామాలలో జనవరి 2022 నుంచి నిర్వహించిన సామాజిక తనిఖీలో గుర్తించిన పనుల వివరాలు నివేదిస్తారన్నారు.

జేసీని కలిసిన గ్రంథాలయ ఉద్యోగులు



జేసీ ప్రవీణ్ ఆదిత్యను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు గురువారం కలిశారు. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థకు పాలకవర్గం లేనందున జేసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ వరప్రసాద్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ సెస్ వసూలుకు కృషి చేయాలని జేసీని వారు కోరారు.

పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



చీడిగలో పొజిషన్ పట్టాలతో లబ్ధిదారులు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ అమ్మ వారి ఆలయ నిర్మాణానికి విశ్వకర్మ కార్పెంటర్ సంక్షేమ సేవా సంఘం, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కార్యదర్శి అరిపిరాల నాగు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొని కొబ్బరి కాయ కొట్టి పూజలో నిర్వహించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి, పెదపాటి వీరబాబు, విశ్వకర్మ కార్పెంటర్ సంక్షేమ సేవా సంఘం ప్రెసిడెంట్ చిట్టిమొజ్జి శ్రీనివాస్, చీడిగ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్, హితకారిణి కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పొజిషన్ పట్టాల పంపిణీ

చీడిగలోని పేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తూ గురువారం పొజిషన్ పట్టాలను సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్, మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, హితకారిణి కార్పొరేషన్ డైరెక్టర్ దూనబోయిన అరుణ, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కాకినాడ క్రైం: స్థానిక సచివాలయం ఉద్యోగి చొరవతో ఓ వ్యక్తి పోగొట్టుకున్న తన ఫోన్‌ను తిరిగి పొందాడు. నగరానికి చెందిన కంప చేతన్ గురువారం మెయిన్ రోడ్‌లో వెళ్తూ తన ఫోన్‌ను జారవిడుచుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత అటుగా వెళ్లిన సుభాష్ రోడ్-1 సచివాలయం పరిపాలనాధికారి బత్తుల నరేష్‌కుమార్‌కు ఆ మొబైల్ దొరికింది. దీంతో ఆయన తన సహోద్యోగులు కొడాలి కీర్తి వలంటీరు టి.హేమ గోపాల్‌లతో కలిసి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. కొద్ది సేపటికి బాధితుడు తన ఫోన్‌కు వేరే నంబర్ నుంచి ఫోన్ చేయగా అది పోలీసు స్టేషన్‌లో ఉందని తెలుసుకున్నాడు. అతడు స్టేషన్‌కు వెళ్లి సీఐ కృష్ణభగవాన్ నుంచి తన ఫోన్‌ను తీసుకున్నాడు. ఈ మేరకు బత్తుల నరేష్‌ను సీఐ అభినందించారు.

వ్యర్థంతో అనర్థం

మూడున్నర లక్షల జనాభా ఉన్న కాకినాడలో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త, వ్యర్థజలాల 'నిర్వహణ' నగరపాలక సంస్థకు సవాల్‌గా మారింది. పెరుగుతున్న జనాభా, అవసరాలకు అనుగుణంగా ఎన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నప్పటికీ వాటి నిర్వహణ కార్పొరేషన్‌కు తలనొప్పిగా మారింది. ప్రమాణాల ప్రకారం వీటి 'నిర్వహణ'ను నిర్లక్ష్యం చేస్తే దేశంలోని అనేక రాష్ట్రాలకు పడుతున్న వందల కోట్ల పెనాల్టీలతో ఇప్పుడు కాకినాడ నగరపాలక సంస్థ కూడా అప్రమత్తమైంది. సమర్థవంతమైన నిర్వహణకు ఓ అడుగు ముందుకు వేసింది.

- నిర్లక్ష్యం చేస్తే వందల కోట్లలో ఎన్‌జీటీ జరిమానాలు
- వ్యర్థాల నిర్వహణకు 5 ఎకరాల అవసరం
- భూమి సమకూర్చే దిశగా కార్పొరేషన్



కాకినాడ: రెండో మద్రాస్‌గా, పెన్షనర్స్ పేరడైజ్‌గా.. అత్యంత నివాసయోగ్య నగరాల్లో దేశంలోనే నాలుగో స్థానంలో ఉన్న 'కాకినాడ' వ్యర్థాల నిర్వహణలో ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోతోంది. నిత్యం ఉత్పత్తి అయ్యే దాదాపు 200 టన్నుల చెత్తను తరలించే డంపింగ్‌యార్డు సమకూర్చుకోవడం నుంచి వ్యర్థ పదార్థాల నిర్వహణలో వెనుకబడుతోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తడి–పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ సీవరేజ ట్రీట్‌మెంట్ ప్లాంట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వెహికల్ యార్డులను కచ్చితంగా సమకూర్చుకోవల్సిన అవసరం ఉంది. అలా చేయలేకపోతే స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్‌జీటీ అనేక రాష్ట్రాలపై భారీ జరిమానా విధిస్తోంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ఓ అడుగు వేసింది.

ఐదు ఎకరాలకు ప్రతిపాదన

వాస్తవానికి పొడి చెత్త ద్వారా వచ్చే వ్యర్థాల నిర్వహణకు 55 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న డ్రైవేస్ట్ కేంద్రం నిర్వహణకు రెండు ఎకరాల స్థలం అవసరమని గుర్తించారు. 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన సీవరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ నిర్వహణకు ఎకరం, 140 టన్నుల సామర్థ్యంతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ కోసం ఒక ఎకరం, సుమారు 160 వాహనాలు నిలిపే యార్డుకు ఒక ఎకరం వెరసి ఐదు ఎకరాలు అవసరమని గుర్తించారు. బొండగుంటలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తాత్కాలికంగానే కొనసాగిస్తున్నారు. సంజయ్‌నగర్ వంటి ప్రాంతాల్లో మొక్కుబడిగానే పొడిచెత్త ప్రాసెసింగ్ జరుగుతోంది. కనీసం ఐదు టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సదుపాయం కూడా ఇక్కడ లేదు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అవశ్యం

నగరంలో 37 ఎంఎల్‌డీల మురుగునీటి వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, కేవలం 5 ఎంఎల్‌డీల నిర్వహణకు మాత్రమే ట్రీట్‌మెంట్ ప్లాంట్ అందుబాటులో ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛ భారత్ నిబంధనల ప్రకారం ఒక్కో ఎంఎల్‌డీకి సుమారు 37 సెంట్లు చొప్పున స్థలాన్ని సిద్ధం చేసుకుని వీటి నిర్వహణ చేపట్టాల్సి ఉంది. కంపేక్టర్లు, ఇతర మార్గాలు ద్వారా చెత్తను తరలించేందుకు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ కోసం కూడా స్థలం అవసరమని కార్పొరేషన్ చెబుతోంది. అలాగే నగరపాలక సంస్థ వద్ద 100కు పైగా హూపర్‌టిప్పర్ వాహనాలతో పాటు, జేసీబీలు, కాంపేక్టర్లు, డోజర్లు, జెట్టింగ్ మెషీన్లు వంటి 150 వాహనాలు నిలిపేందుకు ప్రస్తుతం ఉన్న తాత్కాలిక స్థానం నుంచి పూర్తిస్థాయి సదుపాయాలతో వెహికల్ యార్డు అవసరమని గుర్తించారు.

స్థలం కోసం పాట్లు:

డంప్ యార్డు, సీవరేజ్ ప్లాంటు నిర్వహణకు నగర పరిధిలో ఐదు ఎకరాల స్థలం సమర్చడం గగనమే అయినా ఉపేక్షిస్తే ఎన్‌జీటీ ఆగ్రహానికి గురికాక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో దుమ్ములపేట పోర్టు రైల్వే ట్రాక్ సమీపంలో సుమారు నాలుగున్నర ఎకరాల స్థలాన్ని టీడీఆర్ బాండ్లు జారీ ద్వారా సేకరించేందుకు కార్పొరేషన్ చేస్తున్న యత్నాలకు స్థల యజమాని సైతం ముందుకు వచ్చారు.

ఎన్‌జీటీ జరిమానాలు

వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన రాష్ట్రాలకు ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ భారీగానే జరిమానాలు వేసింది. పశ్చిమబెంగాల్‌కు రూ.3,500 కోట్లు, మహారాష్ట్రకు 12,000 కోట్లు, తెలంగాణకు 3,800 కోట్లు, రాజస్థాన్‌కు 3వేల కోట్లు, కర్ణాటకకు రూ.3,400 కోట్లు జరిమానా విధించిన నేపథ్యంలో ఆ పరిస్థితి ఇక్కడ రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్థలం ఇవ్వడం అభినందనీయం



ప్రజలకు మెరుగైన సేవలు కల్పించే క్రమంలో ప్రభుత్వ అవసరాల కోసం టీడీఆర్ బాండ్లు తీసుకుని స్థలాలను ఇచ్చేందుకు యజమానులు ముందుకు రావడం అభినందనీయం. పట్టణ ప్రాంతాల్లో తీవ్రమైన ప్రభుత్వ స్థలాల కొరత ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గంలో స్థలసేకరణ జరుగుతున్న విధానం ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తోంది.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే, కాకినాడ

ఎన్‌జీటీ ప్రమాణాలకు అనుగుణంగా..



ప్రస్తుతం తాత్కాలిక ప్రాంగణాల్లో మాత్రమే వ్యర్థాల నిర్వహణ జరుగుతోంది. ఇప్పుడు సొంతంగా స్థలాన్ని సమకూర్చుకోవడంవల్ల వీటి నిర్వహణ నగరపాలక సంస్థకు మరింత సులభమవుతుంది. నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు, ప్రమాణాలను కూడా ఖచ్చితంగా పాటించగలిగే అవకాశం కలుగుతుంది.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, నగరపాలక సంస్థ



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ ఆదిత్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

సిద్ధం సభకు తరలిరండి



సుజాత

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్‌ను ప్రతిపక్షం కుట్రల నుంచి రక్షించడానికి జగనన్నకు తోడుగా నిలిచేందుకు ఏలూరులో శనివారం జరగనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ సభకు జిల్లా నుంచి మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పయనమవ్వాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఇందుకు ఏర్పాట్లు చేశారన్నారు.

దేశ మూలాల నుంచి 'సెక్యులరిజం'ను తొలగించలేరు

కాకినాడ రూరల్: భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన దేశమని సెక్యులరిజం అనే దానిని దేశ మూలల నుంచి ఎవరూ తొలగించలేరని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద రేస్ ఆఫ్ పీస్ చర్చిలో గురువారం సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టరు బీహెచ్‌వీ మూర్తిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సెక్యులర్ అనేది మనకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిందన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా భారత దేశంలో లౌకికి వాదులు ప్రశాంతంగా ఉంటున్నారన్నారు. మూర్తిరాజు మాట్లాడుతూ ఈనెల 10న కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్‌లో 'సేవ్ సెక్యులరిజం– సేవ్ ఇండియా' అంశంపై బహిరంగ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మరో అతిథి హైకోర్టు న్యాయవాది దొమ్మేటి సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం నుంచి సెక్యులర్ అనే పదాన్ని తొలగించాలనే ఆలోచన విరమించుకోపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. రెవరెండ్ జోసెఫ్ బెన్నీ, స్టీఫెన్ ఆనంద్, ప్రశాంత్ కుమార్, డాక్టర్ వరప్రసాద్, షేక్ హుస్సేన్, రెవరెండ్ జాషువా గిరి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, జాన్ వెస్లీ, సోనియా మోసా అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం హర్షణీయం

- వయోపరిమితి పెంపుపై జేఎన్‌టీయూకే బోధనేతర సిబ్బందిలో ఆనందం
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న వర్సిటీ బోధనేతర సిబ్బంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్రంలోని వర్సిటీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుండి 62 ఏళ్లకు పెంచడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ ఆవరణలోని నాన్‌టీచింగ్ అసోసియేషన్ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. అధ్యాపకులతో సమానంగా వయోపరిమితి పెంచి తమ కుటుంబాల్లో ఆనందం నింపారని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. ప్రతి ఉద్యోగి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కలను నేరవేర్చారని ఉద్యోగులు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో దాదాపు 95 మంది వరకూ ఈ విధానంతో లబ్ధి చేకూరుతుందని నాన్‌టీచింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు కంచి శ్రీను, కార్యదర్శి సత్తిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ నాగేశ్వరరావు, జేఆర్ జోగారావు, ఏఆర్ రమావతి, జేఎన్‌టీయూకే గెస్ట్ హౌస్ ఇన్‌చార్జ్ మూర్తి, పాండు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు కావాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భావితరాలు బాగుండాలంటే విభజన హామీలు అమలు కావాలని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. కాకినాడ పీఆర్ కళాశాలలో గురువారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదాతో భావితరాలకు జరిగే మేలును విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు 2019 ముందు కంటే తరువాతే గట్టి ఉద్యమం చేశామని అన్నారు. ఈ విషయాలు మేజర్ మీడియాలో రాకపోయినా ఉద్యమం ఆపినట్లు కాదని, గల్లీ నుంచి ఢిల్లీ వరకూ వందలాది కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నమ్మక ద్రోహం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఆఖరి పార్లమెంట్ సమావేశాలు కాబట్టి ప్రతి ఒక్కరూ పార్లమెంటులో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు అంశాన్ని లేవనెత్తాలని, లేకుంటే ఆంధ్ర ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. ఆత్మత్యాగం చేసిన వాళ్లందరికీ నివాళులర్పిస్తూ వారు త్యాగం చేసింది మీలాంటి భావితరాల కోసమేనని శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా దృష్టి పెట్టాల్సిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సూచనలు ఇచ్చారు. జైభారత్ పార్టీ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

2024లో పెత్తందార్లతో జగన్ పోరు





వేములవాడ, కరప గ్రామాల్లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: ప్రజలు విజ్ఞతతో 2024లో జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పెత్తందార్ల తరపున చంద్రబాబునాయుడు, ఇతరులు నిలబడితే పేదల తరపున నిలబడి పోరాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి మళ్లీ ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆయనను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వేములవాడలో గురువారం సర్పంచ్ కమిడి మంగాదేవి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి చూపిన దమ్మున్న సీఎం జగన్ ఒక్కరే అన్నారు. భీమకవి పుట్టిన వేములవాడలో రైతులు, ప్రజలు చైతన్యవంతులని పేర్కొని, గ్రామంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. ముందుగా వేములవాడలో రూ.77 లక్షలు, వలసపాకలలో రూ.55 లక్షలతో పూర్తిచేసిన సీసీ డ్రైన్లు, రోడ్లు, ఆర్వో ప్లాంట్లు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవాలు చేశారు. కరపలో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం వినతి మేరకు స్థలం కేటాయించి, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కరప మండల నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచవరపు సత్యనారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లువరస విష్ణుచక్రం, కేశనకుర్తి మహేష్, ముచ్చుమల్లి వెంకట దుర్గారావు, పట్నాల బాబూరావుల ఆధ్వర్యంలో 100 మంది పార్టీలో చేరగా ఎమ్మెల్యే కన్నబాబు వారికి వైఎస్సార్ సీపీ కొండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వేములవాడలో భారీగా చేరికలు

సీఎం జగన్ సారధ్యంలో ఎమ్మెల్యే కన్నబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేములవాడలో వివిధ పార్టీల నుంచి పాలిక రామకృష్ణ, దూడల శ్రీనివాస్, వెలుబంట్ల రమణ, పోటినాటి అప్పారావు, బండే పట్టాభిరామయ్య, బొండా వీరపండుల ఆధ్వర్యంలో 200 మంది పార్టీలో చేరిన వారికి కన్నబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి రామారావు, రొక్కాల గణేష్, మాజీఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 47వ డివిజన్‌లో రూ.1.88 కోట్ల పంపిణీ



అశోక్‌నగర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, లబ్ధిదారులు

కాకినాడ రూరల్: నవరత్న పథకాలు పేదల ఇంట సిరులు పండించాయని, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలిచారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. 47వ డివిజన్ అశోక్‌నగర్‌లో గురువారం నియోజకవర్గ పరిధిలోని అర్బన్ 47, 48, 49, 50 డివిజన్ల డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా రూ.1.88కోట్లను ఆయన పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని, చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, సెక్రటరీ ఏసుబాబు, మాజీ కార్పొరేటరు రాజారపు వెంకటలక్ష్మి, రాజారపు కృష్ణ, మాజీ కార్పొరేటరు ఐ.శ్రీను, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల చిన్నా, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం

బాలాజీచెరువు: ఏదైనా వ్యవస్థలో ఉన్న వారందరూ సమష్టి కృషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ పదో స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించడంపై బోధన, బోధనేతర సిబ్బందికి గురువారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ వర్సిటీకి గవర్నర్ రావడం, ఏవిధమైన అసౌకర్యం కలగుండా కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉందని, అన్ని స్థాయిల సిబ్బంది సమష్టి సహకారం వల్ల ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, డీఈ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కరపలో 72.65 శాతం పింఛన్ల పంపిణీ



యండమూరులో రెడ్డి లక్ష్మీకాంతానికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ వనుం రేవతి

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,746 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా గురువారం 8,533 మందికి (72.65 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. రూ.3,45,29,000 పంపిణీ చేయాల్సి ఉండగా రూ. 2,50,61,500 ఇచ్చినట్టు తెలిపారు. శుక్ర, శనివారాల్లో నూరుశాతం పూర్తిచేయిస్తామని ఆయన చెప్పారు. గ్రామ కార్యదర్శులతో కలసి ఎంపీడీఓ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

అంధులకు కృత్రిమ మేధ కళ్లజోళ్ల పంపిణీ



పూర్వ విద్యార్థులకు అధునాతన కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ భరతలక్ష్మి

బోట్‌క్లబ్: అంధత్వంతో బాధపడుతున్న చిన్నారులకు దృష్టితో పాటు ఎదుటి వారిని గుర్తించేందుకు సందేశాన్ని అందించి దృష్టినిచ్చే ప్రత్యేక కళ్లజోళ్లు అందజేసి వారి జీవితాలకు కొత్త ఆశలను అందించిన ఘనత బీపీసీ సంస్థకు దక్కుతుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు అన్నారు. దేశంలో బెంగళూరు కేంద్రంగా బ్రెయిలీ ఆధారిత కృత్రిమ మేధతో పనిచేసే విలువైన కళ్లజోళ్లను భారత పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీ) ఆర్థిక సహకారంతో స్థానిక రెడ్‌క్రాస్ అంధుల పాఠశాల పూర్వ విద్యార్థులకు సుమారు రూ.8.5 లక్షల విలువ చేసే కళ్లజోళ్లను 27 మందికి గురువారం అందించారు. చెన్నై రోటరీ క్లబ్ దృష్టి కార్యక్రమ కమిటీ ప్రత్యేక ప్రతినిధి రమణ్ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ ఆధారంగా ఈ కళ్లజోడును ధరించడం వలన ఎదుటివారిని, వస్తువులను గుర్తించడానికి, పుస్తకాలు చదవడానికి, ప్రయాణ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల వంటి అనేక సదుపాయాలు అంధులు పొందగలన్నారు. పీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరతలక్ష్మి అంధులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఎస్‌హెచ్‌జీ టెక్నాలజీ ప్రతినిధులు ఇబ్రహీం, విజయ్ ఈ కళ్లజోడు వినియోగాన్ని వివరించారు. కార్యక్రమంలో రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సేవ చేసే వారికి గుర్తింపు అభినందనీయం



డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని గుర్తించి వారిని సత్కరించడం ఆనందంగా ఉందని కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురిని సత్కరించారు. డాక్టర్ కేఎస్ఎస్ రాజశేఖర్, ఎలిపే జెస్సీ డానియేల్, డాక్టర్ సీహెచ్‌సీఎస్‌వీవీ రమణమూర్తి, సీహెచ్ఎన్ మూర్తి, హేజీబు భానుమూర్తి, రెడ్డి వెంకటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్, షేక్ అమీనుల్లా, బి. సత్యవతి, హరి లోకేష్ శర్మ, రామ నరేష్‌లను క్లబ్ అధ్యక్షులు ఎం.విద్యాసాగర్, కార్యదర్శి ఎం.వెంకట్, వొకేషనల్ డైరెక్టర్ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ సభ్యులు కిరణ్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ వీరభద్రారెడ్డి బాబీ, క్లబ్ సభ్యులు బోడా ఆనందకుమార్, వాకచర్ల సూర్యం, వై.వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వర్ణ పతకాలు

బాలాజీచెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల హెచ్అండ్‌బీఎస్ ఫ్యాకల్టీ జీఎస్ఎస్ దుర్గాభవాని ఎమ్మెస్సీ అప్లెయిడ్ మ్యాథ్స్‌లో 936 మార్కులు సాధించి స్వర్ణ పతకం సాధించింది. నన్నయ వర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆమె గవర్నర్ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు. గురువారం కళాశాలలో దుర్గాభవానీని కళాశాల చైర్మన్ కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. ఫిజిక్స్ విభాగంలో వీఎస్ లక్ష్మీ మహిళా కళాశాల విద్యార్థి వి.కాశీవిజయలక్ష్మీ ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో పి.అనసూయదేవి మెమోరియల్ గోల్డ్ మెడల్ సాధించారు. నన్నయ వర్సిటీ స్నాతకోత్సవంలో వీసీ పద్మరాజు పతకాలను అందజేయగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు సత్కరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ: కాకినాడ పవర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని మెయిన్‌రోడ్డు, బాలాజీచెరువు, రామసోమయాజుల వీధి, జవహర్‌వీధి, దంటువారి వీధి, గోపాలకృష్ణ వీధి, వెంపటి వారి వీధి, అవసరాలవారి వీధి, దుగ్గిరాలవారి వీధి, బాదంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.